క్లుప్తంగా

ముగిసిన శ్రీమద్భాగవతం ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తోన్న శ్రీమద్భాగవతం ధారావాహిక ప్రవచనాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ శ్రీమద్భాగవతం హిందూ మతం, ధర్మశాస్త్రం, సంప్రదాయం, సాహిత్యం, ఆలోచనా విధానంలో ముఖ్యమైన ప్రభావం కలిగిన ఒక పురాణమని చెప్పారు. భగవంతుని కథగా, భగవంతునికి శరణాగతులైన భక్తుల కథగా భక్తి యోగాన్ని చాటి చెప్పే ప్రాచీన గాథ అని పేర్కొన్నారు. ప్రధానంగా విష్ణువు, కృష్ణుడు, ఇతర భాగవత అవతారాలను ఈ గ్రంథంలో చెప్పారని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య పాల్గొన్నారు. అనంతరం మల్లాది కైలాసనాథ్‌ను సత్కరించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ



లక్ష్మీపురం: తోడు నీడు లేక వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వృద్ధులకు ప్రతి ఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలని చిన్నం సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ న్యాయవాది చిన్నం మురళీధర్ తెలిపారు. స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని సోమేపల్లి కాలనీలోని హ్యాపీ కేర్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చిన్నం సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ తరఫున గురువారం వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ పుట్టిన రోజు, పెళ్లి రోజులకు ప్రతి ఒక్కరూ వద్ధాశ్రయాలలో అన్నదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది గుజ్జుల పాండురంగారెడ్డి, ఆడిటర్లు ఎం.ఎస్.ఖాన్, ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 131 మంది విద్యార్థినుల ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో ఉన్న జవహర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 131 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. నియోలింక్ టెలీ కమ్యూనికేషన్స్‌లో అసెంబ్లింగ్ ఆపరేటర్ పోస్టు కోసం నిర్వహించిన మౌఖిక పరీక్షల్లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 58 మంది, హీరో మోటోకార్ప్స్‌లో ప్రొడక్షన్ ఆపరేటర్ పోస్టుకు 73 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో హీరో మోటో కార్ప్స్ హెచ్‌ఆర్ మేనేజర్ సురేష్, జేకేసీ సమన్వయకర్త అపర్ణా సీతారామ్, జేకేసీ మెంటార్లు యూనిస్‌ఖాన్, అపర్ణ పాల్గొన్నారు.

మందుబాబులపై కేసు నమోదు

లక్ష్మీపురం: అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురుని గురువారం సాయంత్రం పోలీసులు అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు. లాడ్జి సెంటర్‌లో ఇద్దరు, కొండయ్య కాలనీలో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ వీరాస్వామి తెలిపారు. బహిరంగంగా మద్యం తాగే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గుర్తు తెలియని ద్విచక్ర వాహనంలో బంగారు ఉంగరాలు

గుర్తు తెలియని ద్విచక్ర వాహనంలో నాలుగు బంగారు ఉంగరాలు కనిపించడంతో పోలీసులు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాడీపేట 4/8వ అడ్డరోడ్డులోని ఓ దుకాణం ముందు నాలుగు రోజులుగా ద్విచక్రవాహనం ఉన్నట్లు సమాచారం వచ్చింది. దీంతో హుటాహుటిన వాహనం ఉన్న ప్రాంతానికి పోలీసులు చేరుకుని తనిఖీ చేశారు. దానిలో నాలుగు బంగారు ఉంగరాలు ఉన్నాయి. పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించి ఉంగరాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. వాహన యజమాని ఎవరు అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

ఈ రోడ్లకో నమస్కారం !

- దశాబ్దంగా వెంటాడుతున్న బాధలు
- మట్టి రోడ్లను తలపిస్తున్న సీసీ రోడ్డు
- భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి అడ్డగోలుగా తవ్వకం
- అసంపూర్తిగా వదిలేసిన నగరపాలక సంస్థ

నగరంపాలెం: గతంలో టీడీపీ ప్రభుత్వ నిర్వాకం ప్రజల్ని వేధిస్తూనే ఉంది. భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులతో విసిగిపోయిన స్థానికులను బాధలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. సిమెంట్ రోడ్లను మధ్యలో తవ్వి వదిలేయడంతో గుంతలుగా మారాయి. మరి కొన్ని ప్రాంతాల్లో ప్రమాదాలకు నిలయంగా మారాయి. సగం సిమెంట్ రోడ్డుగా, మరో సగం మట్టి రోడ్డుగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల గుంతలను పూడ్చేందుకు మంజూరు చేసిన నిధుల్లో కొంతమేర కేటాయించి, రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

దారంతా గుంతలమయం

బొంగరాలబీడు శ్మశానవాటిక వెనుక కాకుమానివారితోట రహదారి గతంలో రాకపోకలకు అనువుగా ఉండేది. డొంకరోడ్డు, శారదాకాలనీ వైపునకు త్వరగా వెళ్లేందుకు సులువుగా ఉంటుంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలు ఎక్కువగా సాగించేవారు. వాహనాల రద్దీ కూడా అధికంగా ఉండేది. గతంలో ఈ దారిలో కాకుమానివారితోట విద్యుత్తు ఉప కేంద్రం నుంచి కొంత వరకు డ్రైనేజీ పనుల నిమిత్తం మధ్యలో తవ్వారు. ఆ తర్వాత ఆ దారిని ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో మట్టి పైకి వచ్చి అక్కడక్కడ గుంతలుగా మారాయి. ఒక్కొక్కసారి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కిందపడిపోతున్నాయి. దీంతో వాహన చోదకులు స్వల్ప గాయాలతో బయటపడుతున్నారు. విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలోనూ మురుగుకాల్వ దారుణంగా ఉంది. ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగాయి. దీనికితోడు చెత్తాచెదారం, వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. రాత్రి వేళల్లో దోమలు ఎక్కువగా ఉంటున్నాయని పరిసర ప్రాంతాల వారు వాపోతున్నారు.



కాకుమానివారితోట రోడ్డులోని విద్యుత్తు ఉప కేంద్రం వద్ద రహదారి దుస్థితి

రాకపోకలకు అవస్థలు



కాకుమానివారితోట రహదారి రహదారికి అనుకుని ఉన్న జానీకాలనీ ఒకటో వీధిలోనూ అదే పరిస్థితి నెలకొంది. గతంలో సిమెంట్ దారి ఉండగా, ప్రస్తుతం అటువంటి ఛాయలేమి కనిపించవు. పూర్తిగా మట్టి రోడ్డుగా తయారైంది. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

సిమెంట్ దిమ్మెలతో పొంచిఉన్న ప్రమాదం

గతంలో సంజీవయ్యనగర్ ప్రధాన రహదారి అధ్వానంగా ఉండేది. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా సీసీ రోడ్డును నిర్మించారు. అయితే, పదేళ్ల క్రితం భూగర్భ డ్రైనేజీ పనుల నిమిత్తం దారి మధ్యలో ఉపయోగించేందుకు తీసుకు వచ్చిన సిమెంట్ దిమ్మెలు అలాగే ఉండిపోయాయి. అప్పటి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా పడేశారు. దీనికితోడు దిమ్మెల వద్ద స్థానికులు చెత్తా చెదారం వేస్తున్నారు. దీంతో మరింత దుర్వాసన వెదజల్లుతోంది. ఒకట్రెండు దిమ్మెలు కాల్వపై పడి ఉండటంతో మురుగునీరు తరలించేందుకు సాధ్యంకావడం లేదు. ఏ మాత్రం ఏమరపాటుగా వస్తే ఒక్కొక్కసారి వాహనాలు సిమెంట్ దిమ్మెలను ఢీకొన్న సంఘటనలు లేకపోలేదు.



సంజీవయ్యనగర్ 1/3, 4 అడ్డరోడ్ల వద్ద డ్రైనేజీ సిమెంట్ దిమ్మెలు

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

సీతారామనగర్ రెండో వీధిలో రోడ్డును అసంపూర్తిగా నిర్మించారు. రహదారికి మొదట్లో, చివర్లో సీసీ రహదారిగా నిర్మించారు. అయితే మధ్యలో కొంత వరకు దారిని వదిలేశారు. చాలా కాలంగా అలాగే ఉండిపోయింది. నాలుగైదు అడుగుల మేర రోడ్డుపై కంకర రాళ్లు ఉండటంతో.. అక్కడకు వచ్చేసరికి నెమ్మదిగా వెళ్లాల్సిందే. ఏమాత్రం అజాగ్రత్తగా ఉంటే పక్కనే పిచ్చిమొక్కలతో నిండిన మురుగు కాల్వలోకి పడిపోవాల్సిందే. అసంపూర్తిగా నిలిచిన దారిపై సిమెంట్ రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అదిగాక ఆ ప్రాంతంలో ఓ పాఠశాల ఉందని, విద్యార్థులు నెమ్మదిగా రావాల్సి వస్తోందని వాపోతున్నారు.



దిమ్మెలు తొలగించాలి

సంజీవయ్యనగర్‌లో గుట్టలుగా ఉన్న సిమెంట్ దిమ్మెలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దిమ్మెలు ప్రమాదకరంగా మారాయి. ఎప్పటికప్పుడు చెత్త చెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, స్థానికుడు సంజీవయ్యనగర్



ఇంటర్ విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి



విజేతలతో ఆర్‌ఐవో జుబేర్, ఫ్రాన్సిస్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

ఆర్‌ఐవో జీకే జుబేర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ స్థాయిలో విద్యార్థులకు క్రీడలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆర్‌ఐవో జీకే జుబేర్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ–జేఈఈ, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌ఐవో జుబేర్ మాట్లాడుతూ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు క్రీడల నిర్వహణపై యాజమాన్యాలు ఆసక్తి చూపడం లేదని తెలిపారు. శారీరక, మానసిక ఉల్లాసం, ఉత్సాహాన్ని పెంపొందించడంలో క్రీడలు దోహదం చేస్తాయన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటా విధిగా స్పోర్ట్స్‌మీట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత ఏడాది జూనియర్ విద్యార్థులకు సైతం క్రీడా పోటీలను ప్రారంభించామని తెలిపారు. డైరెక్టర్ ఎస్. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జోసఫ్‌రెడ్డి, సీఈవో సన్నీ హెన్‌డ్రిక్స్, ఏజీఎం ఏడుకొండలు, డీజీఎం శేషగిరిబాబు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ తక్షణమే కాల్పుల విరమణ పాటించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బుడ్డిగ జమీందార్

గుంటూరు ఎడ్యుకేషన్: గాజాపై ఇజ్రాయిల్ దాడులను నిలిపివేసి, కాల్పుల విరమణ పాటించాలని కేఎల్ వర్సిటీ ప్రొఫెసర్ బుడ్డిగ జమీందార్ పేర్కొన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌ఓ), నవయుగ సమాఖ్య (ఎన్‌వైఎస్) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో గురువారం అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ కల్యాణ మండపంలో పాలస్తీనా సంఘీభావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాన వక్తగా పాల్గొన్న బుడ్డిగ జమీందారు మాట్లాడుతూ పాలస్తీనా, ఇజ్రాయిల్ ఘర్షణ ఇప్పటిది కాదని, వందేళ్లకు పైగా సాగుతున్న సుదీర్ఘ వివాదమని చెప్పారు. 1948 నుంచి ఇజ్రాయిల్, పాలస్తీనాపై దాడులు చేస్తూనే ఉందన్నారు. 1947–48 యుద్ధంలో 70 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారనీ, తాజాగా 2023 నుంచి చేస్తున్న దాడుల్లో 45 వేలకు పైగా పాలస్తీనియన్లు మరణించారని వివరించారు. పశ్చిమ ఆసియాలో ఉన్న 48 శాతం ముడి చమురుపై ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్‌ను సృష్టించిన అమెరికా ఇందు కోసం రూ.లక్షల కోట్లు కేటాయిస్తోందనీ, అమెరికా అండతో ఇజ్రాయిల్ మారణకాండ సృష్టిస్తోందని విమర్శించారు. దీనిని వ్యతిరేకించి, పాలస్తీనాకు సంఘీభావంగా నిలబడాల్సిన బాధ్యతపై విద్యార్థి, యువతరంపై ఉందని తెలిపారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ మాట్లాడుతూ మనుగడ కోసం, స్వేచ్ఛ కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు దేశ ప్రజలందరూ సంఘీభావంగా నిలబడి, అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ నరమేధాన్ని ఆపాలని కోరారు. ఎన్‌వైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాషా మాట్లాడుతూ పాలస్తీనా జాతి హననమే లక్ష్యంగా ఇజ్రాయిల్ అత్యంత దుర్మార్గంగా దాడులు చేస్తోందని తెలిపారు. సభలో స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సి.విజయ, జన సాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివకుమార్, పీడీఎస్‌ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను తదితరులు మాట్లాడారు. ఈ సభలో ''ఉరికంభం సాక్షిగా'' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభానంతరం అరండల్‌పేట నుంచి శంకర్‌విలాస్ సెంటర్ మీదుగా రైల్వేస్టేషన్ వరకు అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, పాలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావంగా 250 మంది విద్యార్థులు, యువకులు మేధావులతో ర్యాలీ నిర్వహించారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికాబద్ధ సన్నద్ధత

డీఈవో సీవీ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. గురువారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ–1) పరీక్షలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని, సబ్జెక్టుల వారీగా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే క్రమంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, పరీక్ష ముగిసిన తరువాత ప్రశ్నాపత్రాలు దిద్ది విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. విద్యార్థులు రాసిన తప్పులను సరిచేసి ప్రశ్నపత్రాలు వారితో చదవించాలని సూచించారు. డీఈవో వెంట హెచ్‌ఎం వసుంధర, ఉపాధ్యాయులు ఉన్నారు.

పీఎఫ్ రుణాలు మంజూరుచేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాలను మంజూరు చేయాలని అదనపు కమిషనర్ సీహెచ్. ఓబులేసుకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరు గురువారం నగరపాలకసంస్థ కార్యాలయంలో ఓబులేసును కలిసిన ఎన్‌టీఏ నాయకులు వినతి పత్రం సమర్పించారు. 87 మంది ఉపాధ్యాయులకు సంబంధించిన రూ.నాలుగు కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రుణాలను మంజూరు చేయాలని కోరారు. 10 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ హామీ ఇచ్చారు. పాఠశాలల్లో తొలగించిన ఉపాధ్యాయేతర, కంటింజెంట్ సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలని, టెన్త్ విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ నగర శాఖ అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి పి. లలితబాబు, గౌరవాధ్యక్షుడు ఎ. వేణుగోపాలరావు, ఆర్థిక కార్యదర్శి కేవీ రాఘవులు, జిల్లా కౌన్సిలర్ కె. వేణుగోపాల్, టి. శ్రీనివాస్, ఎం. బాబూరావు, ఏ. హరగోపాల్ పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌తో భవిష్యత్తు అంధకారం



మాట్లాడుతున్న స్టెప్–స్వశక్తి గుంటూరు మేనేజర్ రాధిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఈవ్ టీజింగ్‌తో భవిష్యత్తు అంధకారంగా మారుతుందని యువజన సర్వీసుల శాఖ, స్టెప్–స్వశక్తి గుంటూరు మేనేజర్ బి. రాధిక పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం యువజన సర్వీసుల శాఖ, స్టెప్–స్వశక్తి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, మాదక ద్రవ్యాల వినియోగం, ఈవ్ టీజింగ్ అండ్ ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ వంటి అనైతిక చర్యలకు పాల్పడం వలన సమాజంలో గౌరవాన్ని కోల్పోవడమే కాకుండా చట్ట పరిధిలో శిక్షలను అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. అక్రమ రవాణా గురించి వివరిస్తూ మహిళలు, బాలికలు మోసపూరిత మాటలు, చర్యల నుంచి అప్రమత్తంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. పట్టాభిపురం ఎస్ఐ డి. ఆంజనేయులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా వంటి కార్యకలాపాలు చట్టపరమైన నేరంగా పరిగణించబడతాయని హెచ్చరించారు. ఆయా చర్యలకు పాల్పడి ఒక్కసారి ఎఫ్ఐఆర్‌లో నమోదైన పక్షంలో విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారుతుందని తెలిపారు. సోషల్ మీడియా ఆధారిత క్రైమ్స్, ఫైనాన్షియల్ క్రైమ్స్‌కు సంబంధించిన బాధితులు టోల్ ఫ్రీ 1930 ద్వారా సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఎస్. అనితాదేవి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డీవీ చంద్రశేఖర్, యుజజన సర్వీసులశాఖ సూపరింటెండెంట్ తన్నీరు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో అశ్రద్ధ వద్దు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: పారిశుద్ధ్య పనులు పిన్ పాయింట్ ప్రకారం జరగాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రంపై శ్రద్ధ చూపాలని చెప్పారు.

సుద్దపల్లి డొంక, ప్రగతీ నగర్, పొన్నూరు రోడ్, ఎల్‌ఆర్ కాలనీ, పట్నంబజారు తదితర ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని ఆదేశించారు. డ్రెయిన్‌ల మీద ఆక్రమణలు లేకుండా ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఎల్‌ఆర్ కాలనీ డ్రెయిన్‌లో మురుగు పారుదల లేకపోవడం, వ్యర్థాలు నిలవడం గమనించి సంబంధిత శానిటరీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని, సచివాలయ పరిధిలో కార్యదర్శులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం ఏటీ అగ్రహారం, రామనామ క్షేత్రం రోడ్ నిర్మాణాన్ని పరిశీలించారు. పనుల జాప్యంలో ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం ప్రారంభించాలని కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, డీఈఈలు నాగభూషణం, మధుసూదన్, శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు సాదిక్ బాషా, రెహ్మాన్, కార్పొరేటర్లు మీరావలి, ఆబీద్ బాషా పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను రేషనలైజేషన్ చేయాలి

గుంటూరు నగరంలో వార్డుల వారీగా ప్రజారోగ్య కార్మికులను రేషనలైజేషన్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో అదనపు కమిషనర్, సీఎంఓహెచ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లతో నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగంలో ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని తెలిపారు. కొన్ని శానిటరీ డివిజన్‌లలో కార్మికులు ఎక్కువగా, మరి కొన్ని డివిజన్‌లలో తక్కువ మంది ఉన్నారని, వారిని తక్షణం రేషనలైజేషన్ చేయాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. మైక్రో ప్యాకెట్స్ వారీగా పుష్ కాట్‌లకు రూట్ మ్యాప్ చేయాలని చెప్పారు. జీఎంసీ గోశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఆవుల వివరాలను పక్కాగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్ల మీద ఆవులను వదిలే వారిపై భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని చెప్పారు. గోశాలకు తరలించిన ఆవులను పది రోజుల్లో యజమానులు రాకుంటే చట్టపరంగా వేలం వేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సీఎంఓహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఏఎంహెచ్‌ఓలు ఆనందకుమార్, రాంబాబు, ఎస్‌ఎస్‌లు సోమశేఖర్, అయుబ్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

మూలికా వైద్యంపై విస్తృత పరిశోధనలు అవసరం

- ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య రత్న షీలామణి
- ఫార్మసీ కళాశాలలో ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ప్రజారోగ్య పరిరక్షణ కోసం మూలికా వైద్యంపై విస్తృత పరిశోధనలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె. రత్నషీలా మణి సూచించారు. వర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 'మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్మెంట్' అనే జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న రెక్టార్ రత్న షీలామణి మాట్లాడుతూ ఔషధాలు కనుగొనడంలో ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విషతుల్యత లేని ఔషధాలను కనుగొనేందుకు విస్తృత పరిశోధనలు చేయాలని సూచించారు. ఉదయం జరిగిన ప్లీనరీ సెషన్‌లో ఆచార్య గురువాయూరప్పన్ మాట్లాడుతూ క్యాన్సర్ నివారణలో నూతన ఆవిష్కరణలు, క్యాన్సర్ రోగులు ఎదుర్కొనే ఇతర ఇబ్బందులను నివారించడానికి తను చేసిన పరిశోధనలో సత్ఫలితాలు వస్తున్నాయని విద్యార్థులకు వివరించారు. హైదరాబాదులోని నల్ల నరసింహారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డీన్ ఆచార్య సిహెచ్.కృష్ణమోహన్ మాట్లాడుతూ తన పరిశోధనలో ప్రీ క్లినికల్ ల్యాబ్ అనుభవాలను వివరించారు. ఒక వైద్యుడు తప్పు చేస్తే ఒకరు, ఇద్దరు రోగులు మరణిస్తారు.. అదే ఒక ఫార్మాసిస్టు వల్ల తప్పు జరిగితే కొన్ని వందల మంది ఇబ్బందులు పడతారని స్ఫూర్తిదాయక సందేశాన్ని ఇచ్చారు. అనంతరం జరిగిన పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, రెండవ, తృతీయ బహుమతులను అందజేశారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పోస్టర్ ప్రజెంటేషన్లకు 137 మంది, రెండు రోజుల జాతీయ సదస్సులో వివిధ యూనివర్సిటీలు, కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు. సదస్సు విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఓఎస్ చైర్మన్, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. విద్యాధరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. ప్రమీలారాణి ప్రసంగించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రత్నషీలామణి, రవిశంకర్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

లక్ష్మీపురం: మంగళగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నేత నిమ్మగడ్డ రామమోహనరావుకు గురువారం బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నాయకులు ఘన నివాళులర్పించారు. వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రామమోహన్ రావు శాసన సభ్యునిగా, మంగళగిరి సమితి అధ్యక్షునిగా, మండల ప్రజాపరిషత్ అధ్యక్షునిగా నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. మంగళగిరి ప్రాంతంలో రైతాంగానికి ఉపయోగపడే కృష్ణాయపాలెం, కాజ గ్రామాలలో ఎత్తిపోతల పథకాలకు నిధులు సాధించి వేలాది ఎకరాలకు నీరందించేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎస్.భావన్నారాయణ, నగర కార్యదర్శి కె. నళినికాంత్, నాయకులు బి.శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, ఎం.ఏ.చిష్టీ, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.